చేనేత వస్త్రాలపై 30 శాతం రాయితీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రావణమాసం సందర్భంగా ఆప్కో విక్రయశాలల్లో అన్ని చేనేత వస్త్రాలపై 30 శాతం రాయితీ ఇస్తున్నట్లు ఆప్కో డివిజనల్ మార్కెటింగ్ అధికారి పి.సోమేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు, చేనేత వస్త్ర అభిమానులకు సరికొత్త నెలవారీ పొదుపు పథకాలు, అరువు పద్ధతిపై విక్రయాలను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ధర్మవరం, మాధవరం, వెంకటగిరి, ఉప్పాడ జరీ చీరలు, బందరు, మంగళగిరి, రాజమండ్రి కాటన్ చీరలు, మెటీరియల్స్, బెడ్ షీట్స్, దుప్పట్లు, దోమతెరలు, లుంగీలు, తువ్వాళ్లు తదితర వాటిని విక్రయిస్తున్నట్లు తెలిపారు. చేనేత వస్త్రాలను విరివిగా కొనుగోలు చేసి చేనేత పరిశ్రమను ప్రోత్సహించాలని కోరారు.

అనుసంధాన పనులు పూర్తయ్యేనా?

బూర్జ మండలం కొల్లివలస, సింగన్నపాలెం మధ్య అసంపూర్తిగా హై లెవల్ కెనాల్ పనులు

- ఇప్పటివరకు 80 శాతం పనులు పూర్తి
- పెండింగ్‌లో 17 ఎకరాల భూసేకరణ
- బూర్జ మండలంలో కాలువ తవ్వకాలపై కోర్టు కేసులు
- డిసెంబర్ 31 నాటికి ముగియనున్న ఒప్పంద గడువు

వంశధార, నాగావళి నదుల అనుసంధానం (హై లెవల్ కెనాల్) పనులను ఎన్నికల షెడ్యూల్ లోపు పూర్తి చేయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. 2017లో మొదలైన పనులు ఒప్పందం ప్రకారం 2020 నాటికల్లా పూర్తి కావాల్సి ఉంది. ఇప్పటివరకు 80 శాతమే పనులు పూర్తయ్యాయి. ఈ ఏడాది డిసెంబరు 31వ తేదీ నాటికి పూర్తవుతుందని వంశధార ఇంజినీరింగ్ అధికారులు చెప్తున్నారు. మరో 20 శాతం మేర పనులను నాలుగు నెలల్లో పూర్తి చేయాల్సి ఉంది. భూసేకరణ, కొన్నిచోట్ల కోర్టు కేసులు ఉన్న నేపథ్యంలో నిర్ణీత తేదీలోగా పూర్తి కావడంపై సందేహాలు నెలకొన్నాయి. దీనికితోడు కాంట్రాక్టర్‌కు బిల్లుల చెల్లింపులో గతంలో తీవ్ర జాప్యం కావడంతో ప్రస్తుతం పనులు చేపట్టడానికి పెద్దగా ఆసక్తి కనబరచడం లేదని తెలుస్తోంది. దీంతో పనులు మందకొడిగా సాగుతున్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార, నాగావళి నదుల అనుసంధానంలో భాగంగా హిరమండలం రిజర్వాయర్ గట్టుకు రెండు తూములు ఏర్పాటు చేసి అక్కడ నుంచి 33.58 కిలోమీటర్ల మేర నారాయణపురం వరకు కాలువ తవ్వాల్సి ఉంది. హిరమండలం వద్ద నీటిని సరఫరా చేసే చోట 43.7 మీటర్ల స్థాయిలో, నారాయణపురం ఆనకట్ట వద్ద కాలువ కలిసే చోట 29.09 మీటర్లు నిర్మించేలా డిజైన్ చేశారు. తద్వారా ఏటవాలుగా నీరు ప్రవహించి ఆనకట్టకు చేరుతుంది. నదుల అనుసంధానం పూర్తి చేస్తే ఎల్ఎన్‌పేట, సరుబుజ్జిలి, బూర్జ మండలాల్లో ఉన్న ఐదు వేల ఎకరాలకు సాగునీరందుతుంది. దీంతోపాటు నారాయణపురం ఆనకట్ట ప్రధాన కాలువల కింద ఉన్న 37,053 ఎకరాల ఆయుకట్టు స్థిరీకరణ జరుగుతుంది.

పెరిగిన ప్రాజెక్టు వ్యయం

వంశధార, నాగావళి నదుల పనులను రూ.84.90 కోట్ల వ్యయంతో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. మార్చి 27, 2017లో పరిపాలనా అనుమతులను మంజూరు చేసింది. ప్రాజెక్టు పనులను నెల్లూరుకు చెందిన పి.వి రమణయ్య అండ్ కంపెనీకి రూ.57.99 కోట్లకు పనులను అప్పగించింది. అనుసంధాన పనులు 2020 నాటికే పూర్తి కావాల్సి ఉంది. పలుమార్లు ఒప్పంద కాలపరిమితిని పొడిగించిన ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 31వ తేదీ నాటికి పూర్తి చేసేలా పొడిగించింది. అంచనా వ్యయాన్ని సవరించి రూ.145.34 కోట్లకు పెంచింది. ఇప్పటివరకు రూ.85.71 కోట్లను వెచ్చించారు.

పనుల జాప్యానికి కారణాలు ఇవేనా..?

హై లెవల్ కెనాల్ పనులకు సంబంధించి ఇంకా భూసేకరణ పెండింగ్‌లో ఉంది. కాలువ తవ్వకాల కోసం 17 ఎకరాల వరకు భూమిని సేకరించాల్సి ఉంది. అనుసంధాన పనులకు సంబంధించి సంబంధిత కాంట్రాక్టర్‌కు రూ.13 కోట్ల చెల్లింపు విషయంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేసింది. దీంతో పనుల కొనసాగింపునకు సంబంధిత కాంట్రాక్టర్ ముందుకు రాలేదు. అధికారులు పలుమార్లు నోటీసులు ఇచ్చినా స్పందించలేదు. జలవనరులశాఖ అధికారులు చివరిగా పెనాల్టీ నోటీసు జారీ చేశారు. దీంతో పి.వి రమణయ్య అండ్ కో కంపెనీ దిగొచ్చి పనులను ప్రారంభించింది. పనులు చేస్తున్నా పెద్దగా ఆసక్తి కనబరచడం లేదు. అదీగాక వర్షాలు పడుతుండడం కూడా పనులు ముందుకు సాగడానికి కొంత ఆటంకంగా మారింది.

కాలువ పనులకు అడ్డంకిగా కోర్టు కేసులు

బూర్జ మండలం చినలంకాంలో కాలువ నిర్మాణం కోసం దేవాదాయ, ధర్మాదాయశాఖకు చెందిన సుమారు 7.5 ఎకరాలు అవసరం పడింది. వంశధార అధికారులు పరిహారం కింద దేవాదాయ, ధర్మాదాయశాఖకు రూ.1.50 కోట్లు చెల్లించేశారు. భూముల్లో 13 మంది రైతులు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. చట్టం ప్రకారం పరిహారంలో 60 శాతం దేవాదాయ ధర్మాదాయశాఖకు, 40 శాతం కౌలు రైతులకు ఇవ్వాల్సి ఉంది. కౌలు రైతులకు పరిహారం చెల్లింపునకు సిద్ధమవుతున్న తరుణంలో ఆ భూములు ఆలయానికి ఇచ్చిన ధర్మదాతకు పరిహారం ఇవ్వాల్సి వస్తే తనకు ఇవ్వాలని, లేకుంటే దేవాదాయశాఖకు చెందాలంటూ కోర్టును ఆశ్రయించాడు. దీంతో బూర్జ మండలం చినలంకాం పరిధిలో 700 మీటర్ల మేర కాలువ తవ్వకాలకు బ్రేక్ పడింది. నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ మార్గంలో కాలువ నిర్మిస్తామని అధికారులు చెప్తున్నారు.

జీడి 'మద్దతు'కు మరో పోరు

- నేడు మోటారు బైక్ ర్యాలీ
- గ్రామాల్లో విస్తృత ప్రచారం

జీడిపిక్కల మద్దతు ధర కోసం రైతులు పోరాటాన్ని ఉధృతం చేస్తున్నారు. 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేలు, రైతుభరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్న డిమాండ్లతో నాలుగు నెలలుగా పలురూపాల్లో ఆందోళనలు కొనసాగిస్తూనే ఉన్నారు. ఇప్పటికే జీపుజాతా, మహాధర్నా, గ్రామసభలు, సదస్సులు, 24 గంటల జీడి సత్యాగ్రహ దీక్ష, లక్ష సంతకాల సేకరణ చేపట్టగా... పోరుబాటలో మరో అడుగు వేస్తున్నారు. మోటారు బైక్ ర్యాలీని ఈనెల 28న చేపడుతున్నారు. కంచిలి నుంచి ప్రారంభమయ్యే ర్యాలీ పలాస వరకు సాగుతుంది. ఉద్దానం గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి రైతులను చైతన్యపరచనున్నారు.

పలాస : మాకన్నపల్లిలో బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని ప్రచారం చేస్తున్న జీడి రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం, పలాస

జిల్లాలో మూడేళ్లుగా జీడి రైతులు దగా పడుతూనే ఉన్నారు. 2020 ఆగస్టులో జీడిపిక్కలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ప్రభుత్వమే కొనుగోలు చేయాలంటూ పలురూపాల్లో ఆందోళనలు చేపట్టాక రాష్ట్ర పశు సంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు జోక్యం చేసుకుని అధికారులు, వ్యాపారులు, రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 80 కేజీల బస్తాను వ్యాపారులు రూ.తొమ్మిది వేలకు కొనుగోలు చేయాలని, ప్రభుత్వం రైతులకు అదనంగా రూ.వెయ్యి ఇస్తుందని వ్యాపారులను ఒప్పించారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామంటూ హామీనిచ్చారు. జీడి రైతులకు డబ్బులూ ఇవ్వలేదు. ఆర్‌బికెల నుంచి పంటా కొనలేదు. ఆ తర్వాత సంవత్సరమూ ఇదే తంతు. గ్రామాల్లో ఎంతమేర జీడి బస్తాల నిల్వలు ఉన్నాయో సర్వే కూడా చేశారు. ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని రైతులకు మరోసారి మాట ఇచ్చారు. ప్రభుత్వం త్వరలో మద్దతు ధర ప్రకటిస్తుందని, అది క్వింటాకా, 80 కేజీల బస్తాకా అని ఆలోచిస్తోందంటూ రైతులను మభ్యపెట్టే ప్రకటనలు చేశారు. రెండేళ్లు గడిచినా దానిపై నోరు మెదపడం లేదు. మద్దతు ధరపై రైతులు ఈ ఏడాదీ ఆందోళనలకు దిగడంతో వ్యాపారులు, రైతులతో మొక్కుబడిగా ఒక సమావేశం నిర్వహించి ఆ తర్వాత ఆ అంశంపై మాట్లాడడమే మానేశారు. మూడేళ్లుగా ఇదే తంతు కొనసాగడంతో వ్యాపారులు తమ పని తాము కానిచ్చేస్తున్నారు. తక్కువ ధరకే పిక్కలను కొని దోపిడీ సాగించారు. 2018-19 సంవత్సరంలో 80 కేజీల బస్తా రూ.14 వేలు నుంచి రూ.15 వేలు మధ్య ధర పలకగా క్రమేణా క్షీణిస్తూ ప్రస్తుతం రూ.7,500 నుంచి రూ.ఎనిమిది వేలకు దిగజారిపోయింది.

ప్రధాన డిమాండ్లు

- 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించాలి. ఆర్‌బికెల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.
- రాష్ట్రంలో జీడి కార్పొరేషన్, జీడి బోర్డు ఏర్పాటు చేయాలి.
- స్థానిక పిక్కలు కొనుగోలు చేసిన తర్వాతనే విదేశీ పిక్కల దిగుమతికి అనుమతి ఇవ్వాలి.
- జీడితోటల్లో అంతర కృషి పరికరాలు రైతులకు ఉచితంగా అందించాలి.
- జీడి పరిశోధనా కేంద్రాలు ప్రాంతాల వారీగా ఏర్పాటు చేసి, అభివృద్ధి చేసిన నాణ్యమైన మొక్కలు రైతులకు అందించాలి.
- జీడి పంటకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకుల ద్వారా రుణాలు ఇవ్వాలి.
- జీడి పంట ప్రాంతంలో పిక్కలు, జీడిపళ్ల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలి.
- ఉపాధి హామీ ద్వారా జీడి తోట అభివృద్ధికి ఎకరాకు రూ.94 వేలు రైతులకు అందించాలి.
- జీడిపిక్కలు ఆరబెట్టుకునేందుకు టార్పాలిన్లను ఉచితంగా అందించాలి.

పట్టుసడలని పోరు

వ్యాపారులు, పాలకుల మోసానికి గురవుతున్న రైతుల్లో తీవ్ర ఆగ్రహం నెలకొంది. మద్దతు ధర కోసం నాలుగు నెలలుగా పట్టుసడలకుండా పోరాడుతూనే ఉన్నారు. గ్రామసభలు, సదస్సులు, జీపుజాతా, మహాధర్నా, 24 గంటల జీడి సత్యాగ్రహ దీక్ష, లక్ష సంతకాల సేకరణ కార్యక్రమాలను చేపట్టారు. ఈ ఆందోళనా కార్యక్రమాలకు గ్రామాల్లో రైతులు, జీడి రైతుల నుంచి విశేష స్పందన లభించింది. లక్ష సంతకాల సేకరణ నేటికీ కొనసాగుతోంది. దీనికి మద్దతుగా పోరాటంలో మరో అడుగు ముందుకు వేసి బైక్ ర్యాలీని ఈనెల 28వ తేదీన చేపట్టనున్నారు. ఈ ర్యాలీ కంచిలిలో సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమవుతుంది. కవిటి, సోంపేట, మందస, పలాస వరకు ర్యాలీ నిర్వహించనున్నారు.

బైక్ ర్యాలీని జయప్రదం చేయాలి

జీడిపిక్కలకు మద్దతు ధర, ఆర్‌బికెల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలనే డిమాండ్లతో మోటారు బైక్ ర్యాలీని నిర్వహించనున్నామని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, జీడి రైతుసంఘం కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కంచిలి నుంచి పలాస వరకు నిర్వహించే ర్యాలీలో ప్రతి గ్రామం నుంచి రైతులు, జీడి రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సంపన్నుల కోసమే అసైన్డ్ చట్ట సవరణ

కెవిపిఎస్ రాష్ట్ర నాయకులు ఎం.సుబ్బన్న

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అసైన్డ్ భూముల చట్ట సవరణ సంపన్నుల కోసమేనని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర నాయకులు మద్దిల సుబ్బన్న అన్నారు. కెవిపిఎస్ ఆధ్వర్యాన 'క్విట్ వివక్ష-క్విట్ మతోన్మాదం' నగరంలోని అంబేద్కర్ విజ్ఞాన మందిరంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్య వచ్చి ఏడున్నర దశాబ్దాలు దాటుతున్నా దళితుల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా ఉందన్నారు. అదానీ, అంబానీలకు దేశ సంపదను దోచి పెడుతున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశంలోని లక్షలాది మంది నిరుపేదలైన దళిత కుటుంబాలకు మాత్రం మొండిచేయి చూపిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం అదే బాటలో పయనిస్తోందని విమర్శించారు. దళితుల అసైన్డ్ భూములను పెత్తందారులకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందన్నారు. దళితులకు మేలు చేకూర్చే కోనేరు రంగారావు, జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. దళితుల భూములు దళితులకే దక్కాలని, రాష్ట్ర ప్రభుత్వం నిలుపుదల చేసిన సంక్షేమ పథకాలన్నీ తిరిగి పునరుద్ధరించి అమలు చేయాలన్నారు. నిరుపేద దళిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం లేకపోగా వారిపై భారాలు మోపుతోందని విమర్శించారు. హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

సామాజిక న్యాయ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కె.రాంగోపాల్ మాట్లాడుతూ అట్రాసిటీ వంటి చట్టాలు ఎన్ని వచ్చినా దళితులపై దాడులు, దౌర్జన్యాలు ఆగడం లేదన్నారు. దళితుల రక్షణ కోసం మరిన్ని చట్టాలు రావాల్సిన అవసరం ఉందన్నారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి చిన్నారావు అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బి.కృష్ణమూర్తి, బోనెల అప్పారావు, బోసు మన్మథరావు, ఎ.గణేష్, ఎం.సూర్యనారాయణ, ఆర్.చిన్నారావు, సిహెచ్.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

అనంతరం కెవిపిఎస్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా మామిడి సూర్యనారాయణ, కార్యదర్శిగా రాకోటి చిన్నారావు, ఉపాధ్యక్షులుగా ఎ.గణేష్, సిహెచ్.లక్ష్మణరావు, టి.తిరుపతిరావు, సహాయ కార్యదర్శులుగా బి.ఎర్రయ్య, టి.రామారావు, జి.ఇల్లయ్య మరో 12 మందిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అరసవల్లి ఆదాయం రూ.4.25 లక్షలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామిని యాత్రికులు ఆదివారం పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. విజయవాడ హౌసింగ్ కార్పొరేషన్ అడ్మిన్ జి.ఎం.ఎస్ శ్రీనివాసరావు కుటుంబసమేతంగా ఆదిత్యుని దర్శనం చేసుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతించారు. స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం అనివెట్టి మండపంలో శేష వస్త్రాన్ని కప్పి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఆదివారం ఒక్కరోజు రూ.4.25 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ ఇఒ వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు. టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.1,69,400, విరాళాల రూపంలో రూ.66,055, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1,90,000 ఆదాయం వచ్చిందని తెలిపారు.

అరసవల్లి అభివృద్ధికి రూ.లక్ష విరాళం

అరసవల్లి ఆలయ అభివృద్ధి పనులకు నగరానికి చెందిన అల్లు వెంకటేష్ తల్లిదండ్రులు అల్లు హటకేశం, గుణవతమ్మ దంపతుల జ్ఞాపకార్థం రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఆలయ సీనియర్ అసిస్టెంట్ కష్ణమాచార్యులను కలిసి చెక్కును అందజేశారు.

మత పోకడలతో పాలన ప్రమాదకరం

- జన విజ్ఞాన వేదిక నాయకులు
- జెవివి నూతన కమిటీ ఎన్నిక
- పలు విభాగాలకు కన్వీనర్ల నియామకం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మత పోకడలతో కూడిన పాలన దేశానికే ప్రమాదకరమని జన విజ్ఞాన వేదిక నాయకులు హెచ్చరించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా మహాసభను నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. జెవివి వ్యవస్థాపక కార్యదర్శి కొత్తకోట అప్పారావు పతాకావిష్కరణ చేశారు. జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో జిల్లా గౌరవాధ్యక్షులు కొత్తకోట అప్పారావు, సీనియర్ సభ్యులు బొడ్డేపల్లి మోహనరావు, విద్యా విభాగం రాష్ట్ర కన్వీనర్ మల్లారెడ్డి పద్మనాభరావు, గరిమెళ్ల అధ్యయన వేదిక కన్వీనర్ వి.జి.కె మూర్తి, అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి చింతాడ కృష్ణారావు మాట్లాడారు. చంద్రయాన్-3 విజయవంతానికి శ్రమించిన ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. శాస్త్రజ్ఞుల మేధో సంపత్తి మెండుగా ఉంటే చంద్రయాన్ దిగిన స్థలానికి శివశక్తిగా నామకరణ చేయడం విచారకరమన్నారు.

సైన్స్‌ను అవమానించిన వారితోనే దేశం నష్టపోతుందని, వీరిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శాస్త్రీయ దృక్పథంపై ప్రజల్లో అవగాహన కల్పించి శాస్త్రీయ సమాజం నిర్మించడమే జనవిజ్ఞాన వేదిక లక్ష్యమని, ఆ దిశగా కృషి చేస్తున్న వేదిక మరింత బలోపేతం కావాలన్నారు. అనంతరం జన విజ్ఞాన వేదిక ప్రచురణలు 'శాస్త్రీయ అవగాహన అంటే ఏమిటి', 'విశ్వావతరణ నుంచి నరావతరణ', 'యస్పాల్ కమిటీ టు అడ్వయిజ్ ఆన్ రినొవేషన్ అండ్ రెజువెనేషన్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్' పుస్తకాలను ఆవిష్కరించారు.

జిల్లా నూతన కమిటీ ఎన్నిక

మహాసభల్లో జన విజ్ఞాన జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా బొడ్డేపల్లి జనార్ధనరావు, అధ్యక్షులుగా కుప్పిలి కామేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా గొంటి గిరిధర్, ఉపాధ్యక్షులుగా వాగ్దేవి, పాలకొండ కూర్మారావు, ఐ.జగన్మోహనరావు, సామ సంజీవరావు, కోశాధికారిగా కుమార్, కార్యదర్శులుగా ఆర్.సురేష్‌బాబు, కె.శ్రీనివాసు, జిల్లా ఆడిట్ కన్వీనర్‌గా ఉమామహేశ్వరరావు ఎన్నికయ్యారు. జిల్లా పాట్రన్స్‌గా కొత్తకోట అప్పారావు, బొడ్డేపల్లి మోహనరావు వ్యవహరిస్తారు.

పలు విభాగాల జిల్లా కన్వీనర్లు ఇలా...

విద్య : పాలవలస ధర్మారావు (కన్వీనర్), బొడ్డేపల్లి జగన్నాథరావు,
సైన్స్ అండ్ టెక్నాలజీ : మన్మథరావు (కన్వీనర్), ఎం.తేజేశ్వరరావు
సమత : టి.ఎర్రమ్మ
చెకుముకి : పి.కూర్మారావు, కె.నగేష్, ఎం.రామకృష్ణారావు
యువత : బి.పురుషోత్తం, ఎ.కృష్ణారావు
కల్చరల్ : తమ్మినేని వైకుంఠరావు, పైడి రామస్వామి, బెండి సూర్యనారాయణ
సోషల్ మీడియా : చింతాడ కృష్ణారావు
పర్యావరణం : ఆగతమూడి వాసుదేవరావు, సిహెచ్.అమ్మిన్నాయుడు
ఆరోగ్యం : జి.సతీష్, కళ్యాణ్‌రాజ్

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

సెప్టెంబర్ 9,10 తేదీల్లో బాపట్ల జిల్లా చీరాలలో నిర్వహించనున్న జెవివి 17వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుప్పిలి కామేశ్వరరావు, గొంటి గిరిధర్ పిలుపునిచ్చారు.

పుస్తకాలను ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

విద్యుత్ కనెక్షన్‌కు ఆధార్ తప్పనిసరి

- ఈ నెలాఖరులోగా చేయించుకోవాలి
- గృహావసరాలకు ఇబ్బంది లేకుండా కరెంట్ సరఫరా
- లోడ్ రిలీఫ్ కోసం పరిశ్రమలకు కొద్దిసేపు కోత
- వ్యవసాయానికి పగటి పూట తొమ్మిది గంటల విద్యుత్
- ఎపి ఇపిడిసిఎల్ ఎస్ఇ ఎల్.దైవప్రసాద్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలోని విద్యుత్ వినియోగదారులు ఈ నెలాఖరులోగా వారి విద్యుత్ సర్వీస్ కనెక్షన్ నంబరుకు ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపి ఇపిడిసిఎల్) ఎస్ఇ ఎల్.దైవప్రసాద్ తెలిపారు. విద్యుత్ బిల్లు చెల్లింపు సమయంలో గానీ, లైన్‌మెన్, బిల్ కలెక్టర్, సెక్షన్ కార్యాలయం, విద్యుత్ రెవెన్యూ కార్యాలయంలో గానీ అనుసంధానం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో గృహ వినియోగదారులు ఇబ్బంది పడకుండా కరెంట్ సరఫరా చేసేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా అవసరాలకు తగ్గట్టు విద్యుత్ పంపిణీ జరగని సందర్భంలో అధికంగా వినియోగిస్తున్న పరిశ్రమలకు లోడ్ రిలీఫ్ కోసం కొద్ది గంటల పాటు కరెంట్ సరఫరా ఆపుతున్నాం తప్ప ఇళ్లకు విద్యుత్ సరఫరా ఆపడం లేదని తెలిపారు. వాతావరణ పరిస్థితుల బట్టి కరెంట్ వినియోగం పెరగడం, కోటా తగ్గడంతో పరిశ్రమలకు కొంత సమయం కోత పెట్టాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలకు ఇస్తున్న 200 యూనిట్ల సబ్సిడీని ఇతరులు వాడుకున్నట్లు గుర్తించామని, వారి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నామని తెలిపారు. ప్రజాశక్తి ముఖాముఖిలో విద్యుత్ పంపిణీ, కోతలు, లోడ్ రిలీఫ్ వంటి అంశాలపై మాట్లాడారు.

జిల్లాలో విద్యుత్ వినియోగం, కోటా పరిస్థితి ఎలా ఉంది?

జిల్లాలో మొత్తం 9,23,416 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వాటిలో గృహ వినియోగ కనెక్షన్లు 7,89,151, వాణిజ్య కనెక్షన్లు 76,476 ఉన్నాయి. పరిశ్రమలకు సంబంధించి 3,067 వీధిదీపాలు, ప్రభుత్వ శాఖలకు సంబంధించి 22,154 కనెక్షన్లు ఉన్నాయి. వ్యవసాయ కనెక్షన్లు సుమారు 24 వేలు ఉన్నాయి. రోజువారీ వినియోగం సగటున ఐదు మిలియన్ యూనిట్ల వరకు ఉంటుంది. జిల్లాకు వస్తున్న కోటా సుమారు ఐదు మిలియన్ యూనిట్లే ఉంది. వాతావరణ పరిస్థితులను బట్టి వినియోగం కాస్త పెరుగుతుంది.

వేళాపాళా లేకుండా కరెంట్ తీసేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి?

జిల్లాకు ఆయా రోజుల్లో రావాల్సినంత మేర కోటా రాని పక్షంలో ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్ (ఇఎల్ఆర్)పేరుతో రెండు, మూడు గంటల పాటు ఆపాల్సి వస్తోంది. విద్యుత్ కోతలు మాత్రం విధించడం లేదు. విండ్ ఎనర్జీ ఉత్పత్తిలో సమస్యలు వచ్చినప్పుడు ఒత్తిడి పడకుండా ఇఎల్ఆర్ విధించాల్సి వస్తోంది. అనధికారికంగా కోతల్లేవు.

గృహ వినియోగదారులకు ఇబ్బంది తలెత్తకుండా ప్రత్యామ్నాయ చర్యలు ఏమైనా చేపడుతున్నారా?

జిల్లాకు విద్యుత్ పంపిణీ కోటా తగ్గిన రోజుల్లో గృహ వినియోగదారులకు ఇబ్బంది రాకుండా చూస్తున్నాం. గ్రిడ్‌ల నుంచి వచ్చే విద్యుత్‌లో ఫ్రీక్వెన్సీ బట్టి సరఫరాలో మార్పులు చేస్తున్నాం. డిమాండ్‌కు తగ్గట్టుగా సరఫరా కావడం లేదు. జిల్లాలో భారీ పరిశ్రమల వరకు కొద్ది సమయం కరెంట్ ఆపుతున్నాం. అధిక కరెంట్ వాడుతున్న జిల్లాలోని ఆరు పరిశ్రమలకు కొద్ది సమయం విద్యుత్ సరఫరాను ఆపుతున్నాం.

జిల్లాలో ఖరీఫ్ సాగు నేపథ్యంలో ఒకవైపు వర్షాలు లేక, బోర్లతో పొలాలను తడుపుకోవడానికి కరెంట్ సరఫరా సక్రమంగా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు?

వ్యవసాయానికి రోజూ పగటి పూటే తొమ్మిది గంటల పాటు విద్యుత్‌ను సరఫరా చేస్తున్నాం. రైతులకు అందిస్తున్న కరెంట్‌లో ఎక్కడా ఇబ్బంది లేదు. కలెక్టర్ సూచనలతో కొన్ని ఎత్తిపోతల పథకాల వరకు కరెంట్‌ను ఆపాం. వాటి కింద ఉన్న బోర్లతో సాగవుతున్న భూములకు కొంత ఇబ్బంది ఉండొచ్చు.

విద్యుత్ కనెక్షన్‌కు ఆధార్ అనుసంధానం తప్పనిసరా?

విద్యుత్ కనెక్షన్‌కు ప్రతి ఒక్క వినియోగదారుడూ ఆధార్ అనుసంధానం చేసుకోవాలి. అనుసంధాన ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది. లైన్‌మెన్, విద్యుత్ కార్యాలయాలు, బిల్ కలెక్టర్లకు వినియోదారులు తమ ఆధార్ ధ్రువపత్రాలను అందించి ఈ నెలాఖరులోగా అనుసంధానం చేయించుకోవాలి.

ఎస్‌సి, ఎస్‌టిలకు ఇస్తున్న 200 యూనిట్ల సబ్సిడీని కొన్నిచోట్ల ఇతరులు వినియోగించుకుంటున్న నేపథ్యంలో ఎటువంటి చర్యలు చేపట్టారు?

ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రభుత్వం 200 యూనిట్ల విద్యుత్ వరకు సబ్సిడీని ఇస్తోంది. జిల్లాలో కొందరు ఒసిలు, బిసిలు వాటిని వినియోగించుకున్నట్లుగా గుర్తించాం. ఇప్పటికే అటువంటి వారికి బిల్లులు జారీ చేశాం. పూర్తిస్థాయిలో డబ్బులు వసూలు చేస్తున్నాం.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మోహనరావు

ధరల నియంత్రణలో ప్రభుత్వాలు విఫలం

పలాస : పెరుగుతున్న ధరలను అదుపు చేయాలని, విద్యుత్ ఛార్జీల భారాలను తగ్గించాలని, ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30 నుంచి సెప్టెంబరు 4 వరకు సిపిఎం ఆధ్వర్యాన సమర భేరి కార్యక్రమం నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు పిలుపునిచ్చారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి సమర భేరి పోస్టర్లను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజు రోజుకీ నిత్యావసర వస్తువుల ధరలు అడ్డూ అదుపు లేకుండా పెరుగుతున్నాయని, దీనివల్ల పేద, మధ్యతరగతి ప్రజలు సరుకులు కొనుగోలు చేయలేక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి అధికారంలోకి రాక ముందు గ్యాస్ రూ.450 ఉంటే... ఇప్పుడు రూ.1200కు పెరిగిందని అన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు అదుపు లేకుండా పెరుగుతున్నాయన్నారు. ధరలను అదుపు చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం బడా వ్యాపారులకు కొమ్ముకాస్తుందే తప్ప ధరలు తగ్గించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామీణ ఉపాధి హామీ నిధులు తగ్గించేస్తూ... ఈ పథకాన్ని ఎత్తివేయాలని చూస్తుందని విమర్శించారు. పరిశ్రమలు మూత వల్ల కార్మికులు ఉద్యోగాలు కోల్పోతున్నారన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎన్.గణపతి, కె.భాగ్యలక్ష్మి, ఎస్.ఢిల్లేశ్వరి పాల్గొన్నారు.

విగ్రహానికి పూలమాలలు వేస్తున్న రఫీ, తదితరులు

తెలుగు భాష తొలి అడుగు 'గిడుగు'

శ్రీకాకుళం అర్బన్: తెలుగు భాష దినోత్సవం సందర్భంగా స్థానిక నగరంలోని జిల్లా గ్రంథాలయంలో ఈ వేమన కవితా నిలయం సాహితి సంస్థ కవి సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంస్థ అధ్యక్షుడు మహ్మద్ రఫీ (ఈవేమన) అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విద్యా భూషన్ డాక్టర్ కె.ఎ.రాములు పాల్గొని తెలుగు భాష తొలి అడుగు గిడుగు అని కొనియాడారు. తెలుగు భాష గొప్పతనం తెలిపే గేయంతో ఫ్లూట్, జాంజరితో ఆహుతులిని అలరించారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన తెప్పల కృష్ణమూర్తి గిడుగు సేవలు ఎనలేనివి అన్నారు. గ్రంథాలయ కార్యదర్శి బుర్రి కుమార్ రాజా మాట్లాడుతూ రామ్మూర్తి పంతులు శ్రీకాకుళం వాస్తవ్యులు కావడం గర్వకారణం అన్నారు. తెలుగును వాడుక భాషగా తీసుకొచ్చిన గిడుగు గొప్ప చిత్రకారులు, ఉపాధ్యాయులు అన్నారు. అనంతరం పలాస జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ తెప్పల కృష్ణమూర్తికి వేమన కవితా నిలయం పురస్కారం అందజేశారు. అలాగే యువకవి కె.శ్రీను రాసిన ఆత్మతమోత్తత్మి ఆమ్మోదయం కవితా సంపుటిని పెద్దలు ఆవిష్కరణ చేశారు. కవులు కె.వి.రాజారావు, ఉమాకవి, పాపయ్య, చాడ శ్రీనివాస్, ఎర్రమ్మ, తేజస్విని, మురళి మాష్టారు, ఎచ్చెర్ల గోవిందరావు, రమణమూర్తి, గ్రంథాలయం శంకరరావు కవితలు అలరించాయి.

మలుపులు తిరుగుతున్న భూ వివాదం

మాదంటే మాదంటూ వీధుల్లోకి...

ప్రజాశక్తి- రణస్థలం

రణస్థలం మండల కేంద్రం జె.ఆర్.పురం సిఐ కార్యాలయం వెనుక, ఎంపియుపి పాఠశాల ఎదురు రావాడ రోడ్డుకి ఆనుకుని ఉన్న సర్వే నెంబరు 2-16లో 13 సెంట్లు స్థలం వివాదాస్పదంగా మారుతోంది. ఈ స్థలం మాదంటే మాదని మాజీ ఎంపిపి డిజిఎం ఆనందరావు.. రణస్థలం మాజీ సర్పంచ్ పిన్నింటి అప్పలనలసయ్య మొదటి భార్య కుమారుడు మాజీ సర్పంచ్ పిన్నింటి లక్ష్మునాయుడు, రెండో భార్య కుమారులు వైసిపి నాయకులు పిన్నింటి సత్యంనాయుడు, శ్రీనివాసరావులు ఈ స్థలం విషయంపై వివాదం తలెత్తడంతో కోర్టును ఆశ్రయించారు.

వివాదమిలా...

ఈ వివాదాస్పద స్థలంలో పూర్వం రాతి కట్టుతో పెద్ద భవనం (సత్రం) ఉండేది. ఈ భవనంలో విజయనగరం మహారాజులు వచ్చి విశ్రాంతి తీసుకోవడం, అలాగే పాదచారులకు కుండలు, పప్పు, బియ్యం ఇచ్చేందుకు ఈ భవనంలోనే నిల్వ ఉంచేవారు. రాజుల పాలన ముగిసిపోవడంతో ఈ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. రణస్థలం సర్పంచి పిన్నింటి అప్పలనలసయ్య ఆ శిథిలావస్థకు చేరుకున్న భవనాన్ని పూర్తిగా తొలగించి ఆ భవనానికి సంబంధించిన రాళ్ల తదితర వస్తువులను

వివాదంలో ఉన్న స్థలం

స్వాధీనం చేసుకున్నారు. అయితే ఈ స్థలానికి సంబంధించి అప్పట్లో విజయనగరం మహారాజులు మాజీ సర్పంచ్ పిన్నింటి అప్పలనలసయ్యకు వెండి రేకుపై ఈ స్థలం రాసిచ్చినట్లు పూర్వీకులు చెప్పుకునే వారు. ఈ స్థలం పూర్వం నుంచీ ఖాళీగా ఉండడంతో మాజీ ఎంపిపి డిజిఎం ఆనందరావు కుటుంబం అప్పటి నుంచి ఈ స్థలంలో పశువులను కట్టడం, గడ్డి కుప్పలు పెట్టుకోవడం, వాహనాలు నిలిపేందుకు రేకుల షెడ్డు ఏర్పాటు చేసుకుని అనుభవిస్తున్నారు. ఈ స్థలంలో భవనాలు నిర్మాణం చేయడానికి ఆనందరావు కుటుంబం గతంలో ఒకసారి పునాదులు తీయిస్తుండగా అప్పలనలసయ్య కుటుంబీకులు తన అనుచరులతో వచ్చి అడ్డుకున్నారు. వీరిద్దరి మధ్య కొట్లాట జరిగి, పోలీసు స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకుని అప్పటి నుంచి ఈ స్థలంపై కోర్టులను ఆశ్రయించారు..అయితే జిల్లా కోర్టులో అప్పలనలసయ్య కుటుంబీకులకు సరైన ఆధారాలు చూపించకపోవడంతో ఒకసారి కేసు కొట్టివేశారు. మరోసారి జిల్లా కోర్టులో 2013లో అప్పలనలసయ్య కుమారులు ఆ స్థలం గెలుచుకున్నారు. ఈ స్థలానికి డిజిఎం ఆనదరావు కుటుంబానికి ఎటువంటి సంబంధం లేదని కోర్టు కేసు కొట్టి వేసింది. అక్కడితో ఆగకుండా ఇరువర్గాలు హైకోర్టుని ఆశ్రయించాయి. ప్రస్తుతం ఈ స్థల వివాదం హైకోర్టులో పెండింగ్‌లో ఉంది.

ఆ స్థలం గ్రామకంఠానిది

రణస్థలం మండల కేంద్రంలోని సర్వే నంబరు 2-16లో 13 సెంట్లున్న స్థలం రెవెన్యూ రికార్డుల ప్రకారం గ్రామ కంఠంగా నమోదై ఉంది. అలాగే ఈ స్థల వివాదం ప్రస్తుతం హైకోర్టులో పెండింగ్‌లో ఉంది. ఈ స్థలం గ్రామ కంఠం కావడంతో పరిరక్షించేందుకు పంచాయతీ అధికారులకు అప్పగించారు. హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నందున ఈ స్థలం మీద ఎవరూ ఎటువంటి కార్యకలాపాలు చేయడం నిషేధం.

- సనపల కిరణ్ కుమార్, తహశీల్దార్

బైక్ ర్యాలీని విజయవంతం చేయాలి

కంచిలి: జీడి రైతులకు మద్దతుగా.. వారి సమస్యల పరిష్కారానికి ఎపి జీడి రైతు సంఘం ఆధ్వర్యాన సోమవారం కంచిలిలో నిర్వహించనున్న బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని కన్వీనర్ అజయ్‌కుమార్ ఒక ప్రకటనలో పిలుపు నిచ్చారు. 80 కేజీల జీడి బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించాలని, రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. జీడి రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ నాలుగు నెలలుగా చేస్తున్న ఉద్యమంలో భాగంగా ఈ బైక్ ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు. కంచిలిలో ప్రారంభమై కవిటీ, సోంపేట, మందసల మీదుగా పలాస చేరుకుంటుందని చెప్పారు. ఈ ర్యాలీలో ఉద్యమాభిలాషుల ంత పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

వజ్రపుకొత్తూరు : జీడి పిక్కలు 80 కిలోల బస్తా రూ.16 వేలుకి కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కొర్నాన బాలాజీ, తమ్మినాన భాస్కరరావులు డిమాండ్ చేశారు. జీడి పంటకు మద్దతు ధర కోరుతూ కంచిలి నుంచి పలాస వరకు ఈ నెల 28న చేపట్టే బైక్ యాత్రను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం

వజ్రపుకొత్తూరు :పోస్టర్లను అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

సీతాపురం, పెద్దబొడ్డపాడు, కొల్లిపాడు, కూర్మనాధపురం, తోటపల్లిలో రైతులతో కలిసి పోస్టర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీడి రైతులను వైసీపీ ప్రభుత్వం నిలువునా ముంచిందని అన్నారు. కార్యక్రమంలో యదళ్ల రాజారావు, తమ్మినాన వాసుదేవ్, ఉప్పాడ సత్యం, టి. పారమ్మ తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

ప్రజాశక్తి- నరసన్నపేట

జగనన్న ప్రభుత్వం ప్రజల మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తుందని జిల్లా పార్టీ అధ్యక్షులు, సీనియర్ శాసనసభ్యులు ధర్మాన కష్ణ దాస్ పేర్కొన్నారు ఆదివారం నరసన్నపేట మేజర్ పంచాయతీ ప్రశాంతి నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం, 15 ఫైనాన్స్ నిధులు రూ.4.30 లక్షలతో సిసి రోడ్డును ధర్మాన కష్ణ దాస్ ప్రారంభించారు. అలాగే సిఎండిఎఫ్ నిధులు రూ. 5 లక్షలతో నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీ గోడను అయిన ప్రారంభించారు. ప్రశాంతి నగర్ కాలనీలో మూడు నెలల క్రితం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నప్పుడు ఈ కాలనీవాసులు కోరగా ... ఈ రోడ్డ నిర్మాణానికి ప్రతిపాదించామన్నారు. ఇప్పుడు ప్రశాంతి నగర్ కాలనీవాసుల కల సాకారమైందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి చింతు అన్నపూర్ణ రామారావు , పిఎసిఎస్ అధ్యక్షులు పోన్నాన దాలినాయుడు, సుడా చైర్మన్ కోరాడ చంద్రభూషణ గుప్త, అటవీశాఖ బోర్డు డైరెక్టర్ బొబ్బదీశ్వరరావు, నరసన్నపేట మేజర్ పంచాయతీ సర్పంచ్ బురెల్ల శంకర్ , ఉప సర్పంచ్ సాసుపల్లి కష్ణ బాబు, వార్డు సభ్యులు నేతింటి సింహాచలం, ఎంపీటీసీ నేతింటి రాజేశ్వరరావు, సారేపల్లి గోవిందరావు, మండల యువజన విభాగం కార్యదర్శి కనపల అరవిందు కుమార్, ప్రశాంతి నగర్ వాసులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

పేదల బతుకులతో ఆటలా?

జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి రామ్మోహనరావు

సూర్యకు సంఘీభావం తెలుపుతున్న జనసైనికులు

పొందూరు: రాష్ట్రంలో నిరుపేదలకు ఇళ్ల నిర్మాణాలు అంటూ ప్రకటనలే తప్ప పలుచోట్ల ఆచరణకు నోచుకోకుండా పేదల బతుకులతో వైసిపి ప్రభుత్వం ఆటలాడుకుంటుందని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహన రావు ఆరోపించారు. మండలంలోని రాపాకలో జగనన్న ఇళ్ల నిర్మాణాల చేపట్టాలని జనసైనికుడు కొంచాడ సూర్య జగనన్న ఇళ్లు పేదలకు కన్నీళ్లు అనే నినాదంతో నిరాహారదీక్ష చేపట్టాడు. ఈ దీక్షకు రామ్మోహనరావు, ఆ పార్టీ మండల అధ్యక్షుడు యలకల రమణలు తమ సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో 34 మందికి పట్టాలు ఇచ్చి రెండేళ్లు దాటుతుందని అన్నారు. అయినా నిర్మాణ పనులు ప్రారంభం కాలేదని అన్నారు. ఇళ్ల నిర్మాణాలకు అనుకూలం కాని ప్రాంతంలో పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారే తప్ప... నిరుపేదలకు న్యాయం చేయాలని నాయకులకు లేదని అన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు పొన్నాడ బాలకృష్ణ, కోరాడ రాజు, రామ్‌లక్ష్మణ్, కొన్న సురేష్, కరుణాసాగర్, పైడి రాంబాబు, సింహాచలం, కొంచాడ రమేష్ పాల్గొన్నారు.

మహిళా సాధికారత టిడిపితోనే సాధ్యం

పొందూరు : మాట్లాడుతున్న రవికుమార్

ప్రజాశక్తి- పొందూరు

రాష్ట్రంలో మహిళా సాధికారత, అభివృద్ధి తెలుగుదేశం ప్రభుత్వంతోనే సాధ్యమని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. మండలంలోని తాడివలసలో సర్పంచ్ తమ్మినేని మణెమ్మ, మాజీ ఎంపిపి కూన ప్రమీల ఆధ్వర్యాన టిడిపి మహిళ మహాశక్తి చైతన్య యాత్ర కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల కోసం డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి వారి అభ్యున్నతికి పాటుపడినది టిడిపి అని అన్నారు. మహిళలను శక్తిమంతులను చేసేందుకు చంద్రబాబునాయుడు ఆరు పథకాలను ప్రకటించారని పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయగల శక్తి మహిళలకే ఉందని తెలిపారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి మహిళలకు టిడిపి ప్రభుత్వం ప్రకటించిన పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, నాయకులు సీపాన శ్రీరంగనాయకులు, చింతాడ కృష్ణవాసుదేవరావు, బలగ శంకరభాస్కరరావు, గాడు నారాయణరావు, బాడాన శేషగిరినాయుడు, బి.సత్యం, వండాన మురళి, పి.వేణుగోపాలరావు, భాస్కరరావు, లక్ష్మణరావు, ఎంపిటిసిలు బాడాన హారిక, ఎ.వాణి, మాజీ సర్పంచ్‌లు ఎ.విజయలక్ష్మి, కూన సుధ, బుజ్జి, అప్పలనాయుడు పాల్గొన్నారు.

పలాస : టిడిపి పూర్వ వైభవానికి మహిళా శక్తి ప్రధానమైనదని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. మండలంలోని గురుదాస్‌పురంలో ఆదివారం మహాశక్తి నిర్వహించారు. ముందుగా గ్రామ పురవీధుల్లో మహిళలతో ఆమె పర్యటించి టిడిపి ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను మహిళలకు వివరించారు. సర్పంచ్ కుత్తుం రూపవతి, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, మండల ప్రధాన కార్యదర్శి దువ్వాడ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల పంపిణీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం సెంట్రల్ రోటరీ క్లబ్ సేవలు విస్తృతం చేస్తామని రోటరీ జిల్లా గవర్నర్ ఆర్.వి.సుబ్బారావు అన్నారు. రోటరీ సర్వీసెస్ అసోసియేషన్ తరపున అధ్యక్షులు ఎరుకోల మోహనరావు ఆధ్వర్యాన కుట్టుమిషన్, మగ్గంపై నిర్వహించిన శిక్షనా కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా 29 మందికి ఉచితంగా కుట్టుమిషన్లు, ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆ ప్రాజెక్టు కావాల్సిన సహాయ సహకారాలు అందజేయాలని కోరారు ప్రపంచంలో అతిపెద్ద సేవా సంస్థ రోటరీ క్లబ్ అని, ప్రతిఒక్కరూ భాగస్వాములై సేవ చేసేందుకు ముందుకు

కుట్టుమిషన్లను అందజేస్తున్న సుబ్బారావు

రావాలని పిలుపునిచ్చారు. రోటరీ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు కొండబాబు మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు 60 మంది చొప్పున మహిలలకు శిక్షణ ఇస్తామని చెప్పారు. అతితక్కువ ధరలో ఆర్ఒ ప్లాంట్ ద్వారా శుద్ధ జలం అందజేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సోమేశ్వరరావు, కోరాడ వైకుంఠరావు, కింతలి నాగేశ్వరరావు, నరసింహమూర్తి, మండ నాగేశ్వరరావు, సి.ఎ.ఐ.కె.రావు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న వైసిపి నాయకులు

శ్రీవిద్య ఆదర్శం

ప్రజాశక్తి- లావేరు

యువతీ యువకులు పడాల శ్రీవిద్యను ఆదర్శంగా తీసుకొని కష్టపడి చదివి లక్ష్యాలను చేరుకోవాలని ఎచ్చెర్ల నియోజకవర్గ వైసిపి నాయకులు లుకలాపు అప్పలనాయుడు, పైడి శ్రీనివాసరావులు అన్నారు. మండలంలోని పాతకుంకాంకు చెందిన శ్రీవిద్య ఇస్రో శాస్త్రవేత్తగా ఎంపికవ్వడంతో ఆదివారం గ్రామస్తులతో కలిసి దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద కుటుంబలో పుట్టిన శ్రీవిద్య, కృషి, పట్టుదలతో కష్టపడి చదివి శాస్త్రవేత్తగా అవ్వడం గర్వకారమన్నారు. కార్యక్రమంలో కోష్ట సర్పంచ్ పిసిని హరినాయుడు, మాజీ సర్పంచ్‌లు గొర్లె రామినాయుడు, వట్టి సత్యం, ఎస్.నాగరాజు, వైసిపి నాయకులు పెరుమళ్ల రమణ, ఎల్.మల్లేశ్వరరావు, టి.శ్రీనివాసరావు, పి.గురునాయుడు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- కవిటి

శ్రీవైష్ణవుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవపట్నం హరినారాయణ అన్నారు. స్థానిక అగ్నికుల క్షత్రియ సంఘం భవనంలో వైష్ణవ సంఘం మండల ఉపాధ్యక్షుడు పురుషోత్తమ శ్యాంసుందర్ ఆధ్వర్యాన నియోజకవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం తమ సంఘ సమస్యలపై స్పందిస్తోందని, ప్రభుత్వం నుంచి తమకు అన్ని విధాల సహకారం అందుతుందని అన్నారు. అనంతరం సంఘ భవన నిర్మాణానికి పది


వినతిపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

సెంట్లు స్థలాన్ని కేటాయించాలని హరినారాయణకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఈ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్, గౌరవ ప్రధాన అధ్యక్షుడు పురుషోత్తమ నారాయణ స్వామి, బొంతలకోటి కృష్ణారావు, కార్యదర్శులు శివకృష్ణ, చిరంజీవి, కన్వీనర్లు వరప్రసాద్, రుషి, ఇసి మెంబర్లు ప్రకాష్, ఉమాపతి, గణపతి పాల్గొన్నారు.

శివసాగర్ బీచ్‌లో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

వజ్రపుకొత్తూరు : అక్కుపల్లి శివసాగర్ బీచ్‌లో ఇటీవల కాలంలో స్నానాలకు దిగి ప్రమాదవశాత్తు కెరటాలకు కొట్టుకుపోయి మత్యువాత పడుతున్నారు. ఇటీవల ఇద్దరు మత్యుఒడికి చేరడంతో స్థానికుల నుంచి పోలీసుశాఖపై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో పోలీసులు చర్యలు ప్రారంభించారు. స్థానిక ఎస్ఐ వై.మధుసూదన్ ఆధ్వర్యాన ఆదివారం శివసాగర్ బీచ్‌లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యాటకులు బీచ్‌లో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. సముద్రం లోతు ఉండే ప్రదేశాల్లో పర్యటకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పర్యాటకులు సముద్ర తీరం, ప్రకృతి అందాలు చూసి ఆనందించాలని, వీలున్నంత వరకు సముద్ర స్నానాలకు దూరంగా ఉంటే మంచిదని అన్నారు. తప్పనిసరి పరిస్థితిలో

హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తున్న పోలీసులు

స్నానం చేయాలంటే పెద్దలు పర్యవేక్షణలోనే చేయాలన్నారు. పర్యాటకులు తాకిడి అధికంగా ఉండే ఆదివారం రోజు మెరైన్ పోలీసులు గస్తీకి వస్తే స్టేషన్ నుంచి కానిస్టేబుల్ వస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్ఐ అప్పలనాయుడు, మెరైన్ ఎఎస్ఐ విజయ్‌కుమార్, బైపల్లి సర్పంచ్ ప్రతినిధి డొంక విద్యాసాగర్, డి.సింహాచలం, పర్యాటకులు పాల్గొన్నారు.

టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

టెక్కలి రూరల్ : టెక్నాలజీని ఒడిసి పట్టుకుని రాబోయే ఎన్నికల్లో సోషల్ మీడియా చురుకైన పాత్ర పోషించాలని టెక్కలి నియోజకవర్గం సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. టెక్కలి ఇన్‌ఛార్జి కార్యాలయంలో జిల్లా సోషల్ మీడియా ఇంఛార్జ్ రాహుల్, ఐప్యాక్ టీమ్ ఆధ్వర్యంలో టెక్కలి నియోజకవర్గ సోషల్ మీడియా విస్తత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో సోషల్ మీడియా పోషించాల్సిన పాత్ర ఏమిటి, ప్రజల్లోకి పథకాల ప్రయోజనాలను ఏవిధంగా తీసుకు వెళ్లాలో సూచించారు. సోషల్ మీడియా కన్వీనర్లు, కో-కన్వీనర్లు, సోషల్ మీడియా కార్యకర్తలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

నేడు ఇసుక ర్యాంపు పరిశీలన

పొందూరు: మండలంలోని మండలం అచ్చిపోలవలస పంచాయతీ సింగూరు వద్ద నాగావళి నదిలో అక్రమంగా నిర్వహిస్తున్న ఇసుక ర్యాంపును సోమవారం టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ పరిశీలిస్తారని టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇసుక ర్యాంపును నిలుపుదల చేయాలని కోర్టు ఆదేశించినా అక్రమంగా నిర్వహిస్తుండడంపై పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి టిడిపి నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీనివాసరావు

'తమ్మిరెడ్డి'కి స్వాగతం

రణస్థలం రూరల్ : జనసేన పార్టీ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసేందుకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్ ఆదివారం ఎచ్చెర్ల నియోజకవర్గ పార్టీ కార్యాలయానికి వచ్చారు. ఈ మేరకు జిల్లా ముఖ ద్వారం పైడిభీమవరంలో ఆ పార్టీ మండల నాయకు డు, ఆర్య వైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు ఆదివారం వడ్డాది శ్రీనివాసరావు తమ్మిరెడ్డికి స్వాగతం పలికారు. దుశ్శాలువ కప్పి సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. సీనియర్ నాయకులు అర్జున్, విజయ్‌కృష్ణ, దన్నాన చిరంజీవి, కూర్మ రమణ పాల్గొన్నారు.

దళితులపై చిన్నచూపు తగదు

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

పలాస: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి దళితులపై దాడులు విపరీతంగా జరుగుతున్నాయని, ప్రభుత్వ విధానాల పై ప్రశ్నిస్తుంటే కేసులు పెడుతున్నారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆగ్రహం వ్యక్తం చేశారు. పలాస ప్రైవేట్ కళ్యాణ మండపంలో ఆదివారం టిడిపి దళిత సాధికార కమిటీ సమావేశం నిర్వహించారు. ముందుగా టిడిపి వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వంలో దళితులకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని, అందుకు సాక్ష్యం బాలయోగి, ప్రతిభా భారతిలను స్పీకర్లుగా నియమించారని గుర్తు చేశారు. టిడిపి ప్రభుత్వంలో అమలు చేసిన 26 పథకాలను వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిందని, అందులో కొన్ని పథకాలను పేర్లు మార్చారే తప్ప పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోతున్నారన్నారు. రాష్ట్రంలో జగన్, పలాస నియోజకవర్గంలో మంత్రి సీదిరి అప్పలరాజు కొండలు, గుట్టలు మాయం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి విఠల్ రావు, టిడిపి రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కష్ణారావు, టంకాల రవి శంకర్ గుప్త, శాసనపురి మురళీ కష్ణ, దళిత నాయకులు రమణ, వడ్డీ యాదగిరి, పట్ట మల్లేష్, సిహెచ్ రామకష్ణ, బొబ్బిలి సంతోష్, వడ్డీ డిల్లీ, తదితరులు పాల్గొన్నారు.

పాల్గొన్న సభ్యులు మాట్లాడుతున్న గౌతు శిరీష

క్రైమ్ కార్నర్

యువకుడు ఆత్మహత్య

శ్రీనివాస్ (ఫైల్)

కోటబొమ్మాళి: మండలంలోని హరిశ్చంద్రపురం రైలు నిలయం సమీపంలో ఆదివారం సంతబొమ్మాళి మండలం గోవిందపురానికి చెందిన సీరాపు శ్రీనివాస్ (34) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీనివాస్ బైక్ వచ్చి రైల్వే ఫ్లైఓవర్ సమీపంలో ఆ వాహనాన్ని పార్కింగ్ చేశారు. అనంతరం రైల్వే ప్లాంట్ ఫారం పడమట చివర పలాస నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు వద్ద ఉన్న సెల్‌ఫోన్, వాచీ, ఆంధ్రాబ్యాంకు ఎటిఎం కార్డు, కొన్ని లెక్కలతో కూడిన చీటి ఉన్నాయి. గ్యాంగ్‌మెన్లు ఇచ్చిన సమాచారం మేరకు పలాస జిఆర్‌పి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని జిఆర్‌పి మార్చురీకి తరలించారు. కొంత సమయానికే వారి దర్యాప్తులో మృతుడు శ్రీనివాస్‌గా గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందజేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్‌బి కాలనీలో వ్యక్తి హత్య

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని హెచ్‌బి కాలనీలో ఆదివారం ఇంటి నేతాజీ (53) హత్యకు గురయ్యాడు. ఆయన తన నివాసంలోనే రక్తపు మడుగులో పడి ఉండడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలను సేకరించారు. క్లూస్ టీం చేరుకుని సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇంట్లో కుటుంబ సభ్యులు లేని సమయంలో ఈ హత్య జరిగి ఉంటుందని అనుమానిస్తున్నారు. గతం నుంచి నేతాజీకి కుటుంబ సభ్యులతో ఆస్తి తగాదాలు ఉన్నట్టు స్థానికులు చెపుతున్నారు. ఆ వివాదాలే హత్యకు కారణమై ఉంటాయని భావిస్తున్నారు. శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం

గుర్తు తెలియని వ్యక్తి మృతి

లావేరు : మండలంలోని బెజ్జిపురం కూడలి సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వైపు వెళ్లే రోడ్డుపై గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందారు. ఈయన వయసు 35 ఉంటుందని. రోడ్డు పక్కన పడి ఉండటంతో స్థానికలు, పోలీసులు 108లో జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారని ఎస్ఐ కోటేశ్వరావు తెలిపారు. విఆర్ఒ శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుని ఆచూకీ కోసం 630 9990851 నంబరుకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ తెలిపారు.

రైల్వే ట్రాక్ పక్కన బోల్తా పడిన ఆటో

ఆటో బోల్తా

టెక్కలి రూరల్ : టెక్కలి సమీపంలో వలియాసాగరం ఫ్లైఓవర్ దగ్గరలో ఆదివారం టెక్కలి నుంచి పోలవరం వైపు వెళ్తున్న ఓ ఆటో అదుపు తప్పి రైల్వేట్రాక్ పక్కన బోల్తా పడింది. అయితే ఘటనలో ఆటోలో ఉన్న ఇద్దరు వ్యక్తులు స్వల్పగాయాలతో బయటపడడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. క్షతగాత్రులను చికిత్స కోసం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రొక్లెయినర్ సహాయంతో ఆటోను బయటకు తీశారు. జిఆర్‌పి ఎస్ఐ షరీఫ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎంఆర్‌పిఎస్ నాయకుడు మృతి

పలాస : ఎంఆర్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు, టెక్కలి డివిజన్ నాయకుడు ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతికి సాంబాన రామారావు, లోపింటి నారాయణరావు, ఊర్నన అప్పలరాజు, జిల్లా అధ్యక్షులు లోపింటి తేజేశ్వరరావు సంతాపం తెలిపారు. ఆయన మృతి ఎంపిఆర్ఎస్‌కు తీరని లోటుని అన్నారు. ఉద్యమం ప్రారంభం నుంచి ఎంతో అంకితభావంతో మాదిగ జాతికోసం ఎస్‌సి రిజర్వేషన్లను ఎబిసిడిలుగా వర్గీకరించాలనే పోరాటంలో మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో పనిచేశారు.

ఎస్ఐ వితరణ

ప్రజాశక్తి- పొందూరు

నిరుపేదలకు అన్నం పెట్టే నిత్య అన్నసత్రానికి ఎస్ఐ లక్ష్మణరావు తనవంతు సాయం అందజేసి తన ఉదారాతను చాటారు. విజయనగరం జిల్లా రాజాం నియోజకవర్గంలోని వావిలవలసలో ఉన్న రాహుల్ సౌరబ్ నిత్య అన్నదాన సత్రం నిర్వాహకులు, సామాజిక కార్యకర్త పాలూరి సిద్ధార్థకు 120 కేజీల బియ్యం, కూరగాయలు ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సిద్ధార్థ చేస్తున్న సేలకు నవంతు సహకారాలు అందిస్తానని తెలిపారు.

బియ్యం ప్యాకెట్లను అందజేసిన ఎస్ఐ లక్ష్మణరావు

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఆమదాలవలస : ఆమదాలవలస-శ్రీకాకుళం రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మంగళవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్తారు బయ్యానాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ స్తంభాలు, పాత విద్యుత్ లైన్లు తీస్తున్నామని పేర్కొన్నారు. 33/11 కెవి సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి టౌన్-1 ఫీడర్ పరిధిలో గల చింతాడ తదితర ప్రాంతాలకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని చెప్పారు. విద్యుత్ విని యోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

వైసిపి జిల్లా అధ్యక్షునికి సత్కారం

పోలాకి : వరుసగా మూడోసారి వైసిపి జిల్లా అధ్యక్షుడిగా ధర్మాన కృష్ణదాస్ నియమితులవడంతో ముబగాం గ్రామంలో కృష్ణ దాస్‌కి సాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగి నాయిడు, మండల పార్టీ అధ్యక్షులు కణితి కృష్ణారావు, వైసిపి నాయకులు కణితి సత్తిబాబు, ఆర్ త్రినాథరావు, చింతాడ ఉమా,పలువు సర్పంచులు ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ఘనంగా మదర్ థెరిసా జయంతి

ప్రజాశక్తి- పలాస

పలాస లయన్స్ క్లబ్ కార్యాలయంలో ఆదివారం లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా మదర్ థెరిసా జయంతి వేడుకలను నిర్వహించారు. ముందుగా థెరీసా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న 46 మంది రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఆర్ హిమాచలం, సెక్రటరీ తమ్మినాన మాధవరావు, కోశాధికారి నెమలిపురి అప్పారావు, కణితి హేమచలం, ఉషాహేమాచలం, కేపీ రామన్న, సింధిరి మధుసూదనరావు, ఎల్. కొండలరావు, ఉమా, బమ్మిడి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఉన్న మలుపు

ప్రమాదకరంగా మలుపు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని హరిశ్చంద్రపురం నుంచి జాతీయ రహదారికి వెళ్లే మార్గంలో ఉండే మలుపు ప్రమాదాలకు నెలవైంది. రోడ్డుకు ఇరువైపులా చెట్లు, ముళ్లపొదలు, దట్టంగా పెరిగిన పిచ్చిమొక్కలు ఉండటంతో మలుపులో దగ్గరకు వచ్చినంత వరకు ఎదురుగా వచ్చిన వాహనాలు కనిపించడం లేదు. దీంతో తరచూ ఇక్కడ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ మలుపు వద్ద ఎదురుగా వస్తున్న వ్యాన్‌ను మరో మోటర్ సైకిల్ ఢీకొని వ్యక్తి మృతి చెందారు. వారం రోజుల వ్యవధిలో మూడు మోటారు సైకిళ్ళ ఢీకొని నలుగురు తీవ్రంగా గాపడ్డాడు. ఇలా నిత్యం ఏదో ఒక సంఘటన జరుగుతున్నా, అధికారులు దృష్టికి తీసుకెళ్లినా సంబంధిత అర్అండ్‌బి అధికారులు పట్టించుకోలేదని వాహనదారులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డుకు ఇరువైపుల జంగిల్ క్లియరెన్స్ చేసి ప్రమాదాలను నియంత్రించాలని కోరుతున్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి

నిరసన తెలుపుతున్న ఎపిటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

బదలీ ఉపాధ్యాయులకు మూడు నెలలుగా చెల్లించని జీతాలు తక్షణమే విడుదల చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టెంక చలపతిరావు డిమాండ్ చేశారు. జీతాలు చెల్లించాలని కోరుతూ ఎపిటిఎఫ్ ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్ నెలలో జరిగిన బదిలీలు రీ అపోర్షన్, ఉద్యోగోన్నతులు చేపట్టిన నాటి నుంచి ప్రభుత్వం ఇప్పటి వరకు ఉపాధ్యాయులకు జీతాలు చెలించలేదని అన్నారు. దీనవల్ల ఉపాధ్యాయులు ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. ఆగస్టు 20లోపు చెల్లిస్తామని విద్యాశాఖ మంత్రి ఇచ్చిన హామీ కూడా అమలు కాలేదని అన్నారు. అనేక సందర్భాలలో నిరసన తెలిపినా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షులు చింతాడ దిలీప్‌కుమార్, జిల్లా అధ్యక్షులు వానా కామేశ్వరరావు, జిల్లా శాఖ గౌరవ అధ్యక్షులు బల్లెడ లక్ష్మణమూర్తి సహ అధ్యక్షులు బి.రవి, అదనపు కార్యదర్శి పి.బాలాజీరావు, ఉపాధ్యక్షులు ఆర్.వి. అనంత ఆచార్యులు, బి.వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు టి.గిరిరాజు, రాష్ట్ర కౌన్సిలర్ పి.శ్రీనివాసరావు, కార్యదర్శి టి.శివరావు, బి.కృష్ణారావు, పి.ఆనందరావు పాల్గొన్నారు.

'గడప గడప'తో సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి- నరసన్నపేట

నరసన్నపేట మేజర్ పంచాయతీ సర్పంచ్ బురెల్ల శంకర్ సొంత వీధి అయిన పురుషోత్తమ నగర్ కాలనీలో ఆదివారం 155వ రోజు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి జనం పోటెత్తారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, సిఇసి సభ్యులు ధర్మాన పద్మప్రియ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి చింతు అన్నపూర్ణ రామారావు, పిఎసిఎస్ అధ్యక్షులు పొన్నాన దాలినాయుడు, పోలాకి ఎంపీపీ ముద్దాడ బైరాగి నాయుడు, సుడా ఛైర్మన్ కోరాడ చంద్రభూషణ గుప్త, పట్టణ అధ్యక్షుడు పొట్నూరు సాయి ప్రసాద్, మహిళా అధ్యక్షురాలు సవర శైలజ, పట్టణ యువజన అధ్యక్షులు దండి జయప్రకాష్, నరసన్నపేట మేజర్ పంచాయతీ సర్పంచ్ బురెల్ల శంకర్, ఉప సర్పంచ్ సాసుపల్లి క్రిష్ణ బాబు, జేసీఎస్ కన్వీనర్ సురంగి నర్సింగరావు, వార్డు మెంబర్లు, ఎంపీటీసీ నగవంశం శ్రీనివాస్ డేవిడ్, నేతింటి రాజేశ్వరరావు, మండల కో ఆప్షన్ మెంబర్ రమణ సాహు, బోరిగివలస సర్పంచ్ పొన్నాన ప్రసాద్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్నఎమ్మెల్యే కృష్ణదాస్

జీవామృతం కుండీల ఏర్పాటు

జీవామృతం కుండీలను ఏర్పాటు చేసిన రైతు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలో ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా నిమ్మతొర్లాడలో వరి పొలం గట్లపై శాశ్వత జీవామృతం కుండీలను ఏర్పాటు చేయించినట్లు ప్రకృసాయ విభాగం యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవి తెలిపారు. ప్రకృతి వ్యవసాయ విభాగం యల్‌టు డిజిటల్ చేపెన సురేష్ తన సొంత పొలం కాంపాక్ట్ బ్లాక్ పరిధిలో ముగ్గురు రైతులు చేత జీవామృతం కుండీలను ఆదివారం ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొలానికి పూర్తిగా సంవత్సరం పొడుగునా శాశ్వతంగా కుండీలను పెట్టుకోవడం వల్ల రైతులు జీవామృతాన్ని కలుపుకోవడానికి చాలా సులువుగా వీలు పడుతుందని తెలిపారు. వరి పంటలో జీవామృతం వినియోగం చాలా కీలకమని, ఇది పంట దిగుబడి పెంచడంతో పాటుగా నేల సారవంతంగా మారడానికి దోహదపడుతుందని అన్నారు. కాంపాక్ట్ బ్లాక్‌లోని రైతులతో జీవామృతం కుండీలను ఏర్పాటు చేయడానికి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.

లావేరు : కథలు చదువుతున్న విద్యార్థులు

గ్రంథాలయంలో కథలు చదువుదాం

లావేరు : లావేరు శాఖాగ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన చదవడం మాకిష్టం కార్యక్రమంలో విద్యార్థులు కథల పుస్తకాలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు విద్యార్థులతో ప్రతి ఆదివారం గ్రంథాలయానికి వచ్చి కథలు చదువుతాం, కథలు వింటాం అని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా చిన్నారుల చెప్పిన కథలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గ్రంథాలయం తరుపున అందజేశారు. విద్యార్థి కథల చదవడంలో పోటీ మనస్తత్వం ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య విద్యార్థులు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: మనిషి తన లక్ష్యం కోసం మొదటి అడుగుతోనే సాధ్యమవుతుందని గ్రంథాలయాధికారి పి.వరలక్ష్మి అన్నారు. శాఖాగ్రంథాలయంలో ప్రతి ఆదివారమూ నిర్వహించే చదవడం మాకిష్టంలో భాగంగా ముందుగా దినపత్రికల పఠనం, కథలను చదివించడం, స్ఫూర్తినిచ్చే శీర్షికలను చదివించారు.

శ్రీకాకుళం : ప్రతి విద్యార్థి దగ్గరలో ఉన్న గ్రంథాలయానికి వెళ్లి అక్కడ ఉండే కథలు, పద్యాలు, పొడుపు కథలు చదివి వాటిపై అవగాహన కల్పించుకోవాలని గ్రంథాలయ అధికారి పి. ఉగ్రసేన పేర్కొన్నారు. ఆదివారం బలగ హడ్కో కాలనీలో గల శాఖ గ్రంథాలయంలో జరిగిన 'చదవడం మాకిష్టం' కార్యక్రమంలో భాగంగా పిల్లలకు కథలు చెప్పారు.. సెలవు రోజుల్లో విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి చిన్న చిన్న కథలు చదివి కొత్తవారికి చెప్పి వారికి మీరు స్ఫూర్తిగా ఉండాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో సహాయకురాలు కె. అనిత విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి అప్పలరాజు

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- పలాస

మందస మండలం గుడ్డిభద్రకు చెందిన టిడిపి నాయకులు పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు సమక్షంలో వైసిపిలోకి ఆదివారం చేరారు. వారికి మంత్రి వైసిపి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టిడిపి విధానాలు నచ్చక వైసిపిలోకి వచ్చారని చెప్పారు. వైసిపిలో చేరిన వారిలో డొక్కరి రాంబాబు, డొక్కరి జనార్ధన, తెప్పల జగన్నాధం, జుత్తు ధూరవాసులు,గేదెల నారాయణరావు, కీలు చామంతి,గేదెల లక్ష్మీ, తెప్పల జయమ్మ తదితరులున్నారు.

బహుమతిగా పూల మొక్కలు

ప్రజాశక్తి- రణస్థలం

సమాజంలో మనం ఆశించే మార్పు మనతోనే మొదలవ్వాలని హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సంస్థ కన్వీనర్ ఆర్.హరిబాబు అన్నారు. ఆదివారం రణస్థలం మండలం, బోయపాలెం గ్రామానికి చెందిన తమ సంస్థ కోశాధికారి సాడి రమణ - దేవి దంపతుల కుమార్తె నీతూశ్రీ బారసాల కార్యక్రమంలో పాల్గొన్న ఆయన బంధువులకు ప్లాస్టిక్ కానుకలకు బదులు పూల మొక్కలు ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. మన ఇంట్లో జరిగే శుభకార్యాలలో బంధువులకు కానుకలు ఇవ్వడం సంప్రదాయమని, అయితే పర్యావరణ పరిరక్షణ కోసం ఇలా మొక్కలను ఇవ్వడం మంచి పద్ధతి అని హరిత సంస్థ సభ్యులు రంభ దేవుడు బాబు అన్నారు. కార్యక్రమంలో హరిత సంస్థ సభ్యులు కె.మనోజ్ కుమార్, జి.ఎ.రాయుడు, కె.శివకేశ్, గ్రామ పెద్దలు సాడి అసిరయ్య, సాడి సూరిరెడ్డి, సాడి శ్రీరామ్, మధుసూదనరావు పాల్గొన్నారు.

కిచెన్ గార్డెన్‌పై అవగాహన

ప్రజాశక్తి- పలాస

కిచెన్ గార్డెన్‌పై నేటి విద్యార్థులకు అవగాహన కల్పించి ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణానికి పాటుపడాలని జేడీ ఫౌండేషన్ పలాస మండల ప్రతినిధి కిరణ్ కుమార్, గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్ పిలుపునిచ్చారు. కాశీబుగ్గ బిసి వసతి గృహం వద్ద జేడీ ఫౌండేషన్, గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యాయ వార్డు గ్రహీత అస్పాన మధుబాబు, బీసీ వెల్ఫేర్ అధికారి నీలాపు ఉపేంద్ర, బయాలజీ ఉపాధ్యాయులు దాసరి శ్రీనివాస్, బోకర.దుర్యోధన, గ్రీన్ సభ్యులు రెయిన్బో డిజిటల్స్ నూకల హేమసుందర్, వసతి గృహ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లోకి వెళ్లాలి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

జనసేన గెలుపుకు గ్రామాల్లోకి వెళ్లి పార్టీ సిద్ధాంతాలను ప్రజకు వివరించాలని ఆ పార్టీ మండల సీనియర్ నాయకులు పొట్నూరు లక్ష్మునాయుడు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో ఇతర పార్టీల నాయకులను సేకరించి జనసేన పార్టీలోకి ఆహ్వానించాలన్నారు. సరికొత్త ఆలోచన చేసి జనసైనకులు, వీరమహిళలు కలిసి జనసేన పార్టీలోకి తీసుకురావాలన్నారు.